


హామీలతో అందలం.. అమలులో గరళం

కూటమికి అధికారం అప్పగిస్తే ప్రజలకు అండగా ఉంటాం. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసి ఆర్థికంగా బలోపేతం చేస్తాం. పిల్లల చదువుకు, నిరుద్యోగులు, మహిళలు, రైతులకు కష్టంరాకుండా కంటికి రెప్పలా కాపాడుకుంటాం₹ అంటూ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామంటూ భరోసా ఇచ్చారు. అయితే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా, పవన్‌కల్యాణ్ ఉపముఖ్యమంత్రిగా అధికారం చేపట్టి రెండు నెలలు గడిచినా వాటి అమలుపై ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో ఓటు వేసిన మహిళలు, రైతులు, నిరుద్యోగులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి బాగోలేదంటూ సీఎం చంద్రబాబు సన్నాయి నొక్కులు నొక్కడం.. తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ ఈ ఏడాది ఇచ్చేదే లేదంటూ సంబంధిత శాఖల మంత్రులు చేతులెత్తేయడంతో ప్రజలు కూటమి ప్రభుత్వంపై పెట్టుకున్న ఆశలు ఆవిరవుతున్నాయి.

– నెట్‌వర్క్, సాక్షి

సూపర్ సిక్స్

- యువతకు 20 లక్షల ఉద్యోగాలు / నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి
- స్కూలుకి వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15,000
- ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం
- ప్రతి మహిళకి నెలకు రూ.1500 (19 సం॥ నుంచి 59 సం ॥ వరకు)
- ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

● సూపర్ సిక్స్ పథకాలు అంటూ ఎన్నికల్లో చంద్రబాబు హామీలు ● అధికారంలోకి వచ్చి రెండు నెలలైనా అమలుపై కానరాని స్పష్టత



ప్రతి మహిళకు నెలకు రూ.1500

భీమవరం నియోజకవర్గంలో.. 90వేల మంది

ఉండి నియోజకవర్గంలో.. 1,11,748 మంది

జగన్ పాలనలో ఒక్కో ఏడాది రైతులకు అందిన సాయం

భీమవరం నియోజకవర్గం..8 వేల మంది

ఉండి నియోజకవర్గం 14,580 మందికి

మొత్తం రూ.29.16 కోట్లు



జగన్ పాలనలో ఒక్కో ఏడాది తల్లులకు అందిన సాయం

భీమవరం నియోజకవర్గంలో

ఉండి నియోజకవర్గంలో 25,770

మందికి రూ.15వేల చొప్పున

రూ.38,65,50,000





యువతకు నెలకు 3 వేల రూపాయల నిరుద్యోగ భృతి

భీమవరం నియోజకవర్గంలో.. 40 వేల మంది

ఉండి నియోజకవర్గంలో.. 79,976 మంది

నిరుద్యోగ భృతి ఇస్తారో? లేదో?

కంపెనీలను పెద్ద ఎత్తున రప్పిస్తాం, యువకులకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు ఇప్పిస్తాం, లేదంటే నిరుద్యోగ భృతి ఇస్తాం అని ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. చంద్రబాబును నమ్మి ఓటు వేస్తే అధికారంలోకి వచ్చి రెండు నెలలైనా నిరుద్యోగ యువతను పట్టించుకోవడం లేదు. ఎవరికీ నిరుద్యోగ భృతి ఇవ్వలేదు. నేను రెండు డిగ్రీలు చదివి ఉద్యోగం రాక వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాను.

– పదవల నాని, బాలేపల్లి, వీరవాసరం మండల

రైతులకు సాయమేది?



చంద్రబాబునాయుడు అధికారం చేపట్టి రెండు నెలలు గడుస్తున్నా రైతులకు పంట పెట్టుబడి సాయం అందించేందుకు ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం బాధ కలిగిస్తోంది. అదే వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఒక తేదీని ప్రకటించి ఆ సమయానికి కచ్చితంగా రైతుల బ్యాంక్ ఖాతాకు రైతు భరోసా నిధులను జమ చేసి ఆదుకున్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలి.

– కందుల సాయి సత్యనారాయణ, రైతు, వీరవాసరం

నిరుద్యోగ భృతిపైనే ఆశలన్నీ



కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి. ఎన్నికల్లో చంద్రబాబునాయుడు నిరుద్యోగ భృతి ఇస్తానని హామీ ఇవ్వడంతో ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఉద్యోగానికి దరఖాస్తు చేయాలన్నా తల్లిదండ్రులపై ఆధారపడాల్సి వస్తోంది. ప్రస్తుతం చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడటంతో నిరుద్యోగ భృతి ఇస్తే ఎంతో ఆసరాగా ఉంటుంది. నా తండ్రి ఆటో నడుపుతున్నారు.

– ఎండీ ప్రవీణ్‌భాను, ఆకివీడు

క్లుప్తంగా

ఐటీఐ విద్యార్థుల స్వచ్ఛతా హీ సేవ

ఉండి: మండలం ఎన్నార్పీ అగ్రహారం ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఐటీఐ ప్రధానాధికారి వీ శ్రీనివాసరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని అన్నారు. కార్యక్రమంలో ఐటీఐ అధికారులు,సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

కాళ్ల: పరిసరాల పరిశుభ్రతకు ప్రతీ ఒక్కరు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయా గ్రామ సర్పంచ్‌లు తెలిపారు. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం గ్రామంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో దోమలు ప్రబలకుండా దోమల మందు పిచికారీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

భీమవరం: భీమవరం పట్టణం గరగపర్రురోడ్డులోని డీమార్ట్ సమీపంలో వాహనం ఢీకొని వ్యక్తి గాయపడినట్లు టుటౌన్ ఎస్ఐ రెహమాన్ చెప్పారు. పట్టణానికి చెందిన డి మావుళ్లు ఈనెల 15వ తేదిన గరగపర్రు రోడ్డులో మోటారు సైకిల్‌పై వెళ్తుండగా టాటాసుమో వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతని బంధువులు చికిత్స కోసం రాజమహేంద్రవరం ఆస్పత్రిలో చేర్పించారు. మావుళ్లు కుమార్తె దుర్గాభవాని ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

ఎస్ఆర్‌కేఆర్‌లో వినాయకుడి లడ్డూ రూ. 27 వేలు

భీమవరం: పట్టణంలోని ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం గణేష్ నిమజ్జనం విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. వినాయకచవితి సందర్భంగా కళాశాల ఆవరణలో ప్రత్యేకంగా గణేష్ ప్రతిమను ఏర్పాటు చేసి 11 రోజులు పూజలు నిర్వహించారు. వినాయకుడికి ప్రసాదంగా పెట్టిన లడ్డును వేలం నిర్వహించగా రూ. 27 వేలకు కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు దక్కించుకున్నారు. అనంతరం గణేష్ ప్రతిమను ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు, ప్రిన్సిపల్ కేవీ మురళీకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏచూరి సంస్మరణ సభ

భీమవరం: సీతారాం ఏచూరి తన ప్రజా జీవితాన్ని ఎస్ఎఫ్ఐలో చురుకైన నాయకుడిగా ప్రారంభించి విద్యార్థుల్లో అత్యంత ప్రజాదరణ పొందిన, శక్తివంతమైన నాయకులలో ఒకరిగా ఎదిగారని ఎస్ఎఫ్ఐ పూర్వపు జిల్లా కార్యదర్శి మంతెన సీతారాం అన్నారు. బుధవారం భీమవరంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సీతారాం సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాటంలో విద్యార్థులను సమీకరించడంలో సీతారాం కీలక పాత్ర పోషించారు. ఈ కార్యక్రమంలో మరొక పూర్వపు జిల్లా అధ్యక్షుడు జెఎన్‌వీ గోపాలన్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె ఈశ్వర్, పి వాసు తదితరులు పాల్గొన్నారు.

యోగాతోనే మానసిక ఉల్లాసం

కలెక్టర్ నాగరాణి

భీమవరం: యోగాతో మానసిక ఉల్లాసం సాధ్యపడుతుందని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం భీమవరం పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలో అల్లూరి వెంకటరాఘవరాజు చారిటబుల్ ట్రస్ట్, సాకారాత్మ ఫౌండేషన్ సంకల్ప సమాధి యోగ ఆధ్యాత్మిక ఆరోగ్య సేవా సంస్థ సిద్ధ ఆశ్రమం సంయుక్తంగా ప్రేమ్ నిరంతర గురూజీ డాక్టర్ నాన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంకల్ప సమాధి యోగ కార్యక్రమానికి ఆమె జ్యోతి ప్రజ్వల చేసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ యోగాతో శారీరక, మానసిక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని యోగా అభ్యాసనపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. యోగా మనిషిలోని ఒత్తిడి, ఆందోళనను తగ్గించి నిరాశ నిస్పృహల నుంచి బయటకు తీసుకురావడానికి ఉపయోగపడుతుందన్నారు. అల్లూరి వెంకట రాఘవరాజు ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పివిఎస్ఎస్ఎన్ రాజు (డిటిడిసి బాబు) మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా 21 రోజులు పాటు నిర్వహించే సంకల్ప సిద్ధి ఉచిత యోగ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్ఎస్ సర్జికల్ ఆంకాలజీ డాక్టర్ అల్లూరి వంశీకృష్ణ, డెర్మటాలజీ ఎండి డాక్టర్ ప్రియాంకవర్మ జిల్లా ప్రజలకు సేవ చేసే లక్ష్యంతో త్వరలో భీమవరంలో ప్రాక్టీస్ ప్రారంభించనున్నట్లు బాబు తెలిపారు.



సభలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

పారిశుధ్య ధ్యకార్మికులకు రెయిన్‌కోట్స్ పంపిణీ....

అల్లూరి వెంకటరాఘవరాజు చారిటబుల్ ట్రస్ట్ ప్రారంభం సందర్భంగా భీమవరం మునిసిపాల్టీ పారిశుధ్య కార్మికులకు రూ.1.5 లక్షల విలువచేసే రెయిన్ కోట్స్‌ను కలెక్టర్ నాగరాణి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్ నిరంతర గురూజీ డాక్టర్ నాన్న, గ్లోబల్ సర్వీస్ కోఆర్డినేటర్ లైన్స్ ఇంటర్నేషనల్ సిహెచ్ కృష్ణంరాజు, మున్సిపల్ కమిషనర్ కె రామచంద్రారెడ్డి, కె నర్సింహారావు, కె అలివేలు మంగతాయారు, అల్లూరి ప్రసాద్, పిఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు చేయూత

భీమవరం: విజయవాడ వరద బాధితులను ఆదుకోడానికి పలువురు దాతలు ముందుకు రావడం అభినందనీయమని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం భీమవరం బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ. 2 లక్షలు, పాత ఇనుము వ్యాపారస్తుల సంఘం ఆధ్వర్యంలో రూ. 2.01 లక్షలు, ఆటో ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ తరపున రూ. 35 వేలు ఎమ్మెల్యే అంజిబాబుకు అందజేశారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా ముందుకు రావాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో దాట్ల శ్రీరామరాజు, చెన్నంశెట్టి సత్యనారాయణ, గన్నాబత్తుల శ్రీనివాస్, ద్వారకా రంగరాజు, బొమ్మిడి వెంకటేశ్వరరావు, గంటా త్రిమూర్తులు, గొలగాని సత్యనారయణ, యింటి సత్యనారాయణ, పంపన గోపి, ములిగుర్తి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



భీమవరం ఎమ్మెల్యే అంజిబాబుకు రూ.2.01 లక్షల నమూన చెక్కును అందజేస్తున్న దృశ్యం

వరద బాధితులకు రాయలం గ్రామస్తుల విరాళం

భీమవరం: మండలంలోని రాయలం గ్రామ ప్రజలు విజయవాడ వరద బాధితుల సహాయార్థం సుమారు రూ. 5 లక్షలు ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు)కు అందజేశారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ కష్ట సమయంలో బాధితులను ఆదుకోవడానికి దాతలు స్పందించిన తీరు ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రాయలం జనరల్ సెక్రటరీ పత్తి హరివర్ధన్, మాజీ సర్పంచ్‌లు గుసిడి సూరిబాబు, కోళ్ల రామచంద్రరావు (అబ్బులు), కోళ్ల నాగబాబు(పండు), కోళ్ల సీతారాం, యర్రంశెట్టి శివకృష్ణ, కోళ్ల సీతారామయ్య, వీరమల్లు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

భీమవరం అర్బన్: చిరుధాన్యాలతో కూడిన ఆహారంతో పాటు ఆకుకూరలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతంగా ఉండవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి. కనకమహాలక్ష్మి తెలిపారు. భీమవరం మండలంలోని అనాకోడేరులోని డీఎన్నార్ హైస్కూల్లో బుధవారం మిషన్ శక్తి, పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ కనకమహాలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులకు చిన్నతనం నుంచి గుడ్ టచ్, బాడ్ టచ్‌లపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. అంతేకాకుండా మహిళలను వేధించిన, వారిపై దాడులు, అత్యాచారాలకు పాల్పడిన కఠిన శిక్షలు అమలులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్ఎమ్, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



అనాకోడేరులో డీఎన్నార్ హైస్కూల్లో గుడ్ టచ్, బాడ్ టచ్‌లపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ధాన్యం కొనుగోలుపై అవగాహన సదస్సు

ఉండి: ఖరీఫ్ 2024–25కు గాను ధాన్యం కొనుగోలుపై అధికారులకు తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కె.నాగార్జున మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు ప్రభుత్వం ధాన్యం మద్దతు ధరలు ప్రకటించినట్లు తెలిపారు. మండల వ్యవ సాయాధికారి బి.సంధ్య మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు సమయంలో రైతులే స్వయంగా గోనె సంచులు ఏర్పాటు చేసుకుంటే ఒక్కో సంచికి రూ.3.39 లేబర్ చార్జీలు, హమాలీ చార్జీలు క్వింటాల్‌కు రూ.17.17 రవాణా చార్జీల నిమిత్తం టన్నుకు 0 నుంచి 8 కిలోమీటర్ల దూరానికి రూ.324 చెల్లిస్తామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ ఎం.మహేష్, వీఆర్వోలు, వీపీవోలు, సొసైటీ అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై సమీక్ష

ఆకివీడు: ఖరీఫ్ ధాన్యం సేకరణపై బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ ఎన్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మద్దతు ధర రైతులకు లభించే విధంగా వ్యవసాయశాఖ, రెవెన్యూ అధికారులు పరిశీలించాలన్నారు. ఫైన్‌రకం ధాన్యం క్వింటాళ్లు రూ.2320, కామన్ రకం రూ.2300 కొనుగోలు చేయాలన్నారు. ప్రస్తుత సీజన్ నుంచి రైతులు ఆన్‌లైన్ విధానంలో కాకుండా రైస్ మిల్లులకు నేరుగా ధాన్యాన్ని తోలుకోవచ్చన్నారు. వ్యవసాయాధికారిణి ప్రియాంక, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఒడిసా బృందం పర్యటన

కాళ్ల: ఒడిసా రాష్ట్రం మత్స్యశాఖ బృందం కాళ్ల మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం క్షేత్ర స్థాయిలో పర్యటన చేశారు. మత్స్యశాఖలో అత్యధిక దిగుబడి సాధిస్తున్న దృష్ట్యా రైతులు పాటిస్తున్నటువంటి యాజమాన్య పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా సీసలి గ్రామంలో చేపలు, రొయ్యల చెరువుల సాగుతో పాటు కాళ్ల గ్రామంలో స్పాన్ హేచరీలను ప్రత్యేకంగా పరిశీలించారు. సీసలి, చిన కాపవరం మత్స్యశాఖ సహాయకులు సత్యనారాయణ, అహ్మద్ హుస్సేన్ పాల్గొన్నారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

ఉండి: ఇంటి విషయమై జరిగిన గొడవలో మహిళపై దాడి చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తణుకు వెంకట్రాయపురానికి చెందిన శీలబోయిన శ్రీదేవి ఉండిలోని ఓ ఇంటిని కొనుగోలు చేసింది. నాలుగు పోర్షన్ల ఆ ఇంట్లో మూడు వాటాలను కొనుగోలు చేసిన ఆమె వాటిని రిజిస్ట్రేషన్ చేయించుకొని అద్దెకు ఇచ్చింది. అయితే నాలుగో పోర్షన్ యజమాని అయిన లోసాబత్తుల సంతోష్ అనే వ్యక్తి ఆ మూడు పోర్షన్‌ల అద్దె యజమాని శ్రీదేవికి ఇవ్వకుండా తానే తీసుకుంటున్నాడు. ఇది తెలిసిన యజమానురాలు ఈ నెల 17 మంగళవారం వచ్చి, ఆమె అద్దె తనకు ఇవ్వని కారణంగా ఇంటి పోర్షన్లు ఖాళీ చేయాలని అద్దెకుంటున్న వారికి చెప్పింది. దీంతో నాలుగో పోర్షన్ యజమాని అయిన సంతోష్ మహిళపై దాడికి దిగాడు. ఆమె జుట్టు పట్టుకొని గోడకు కొట్టి, ఇనుపరాడ్‌తో ఆమెపై దాడి చేయడంతో గాయపడిన ఆమె భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చేరి చికిత్స పొందుతుంది.ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు ఎస్సై మహ్మద్ నసీరుల్లా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు రైల్వే అధికారులతో కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ సమీక్ష

భీమవరం: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో రైల్వే సమస్యల పరిష్కారానికి గురువారం రైల్వే అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు కేంద్ర ఉక్కు, భారీపరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.విజయవాడ డీఆర్ఎం కార్యాలంలో సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించి వందేభారత్ ఎక్స్ ప్రెస్ రైలును భీమవరం, నరసాపురం వరకు పొడిగించాలని, నర్సాపురం-కోటిపల్లి రైల్వే డబ్లింగ్ పనులు వేగంగా పూర్తయ్యేలా సమావేశంలో చర్చించనున్నట్లు శ్రీనివాసవర్మ తెలిపారు. అత్తిలి, తాడేపల్లిగూడెం, నరసాపురం, తణుకు పట్టణాల్లో అన్ని ఎక్స్ ప్రెస్ రైళ్లకు హాల్ట్ కోసం డీఆర్ఎం, రైల్వే అధికారులకు ప్రతిపాదిస్తానని కోవిడ్‌కు ముందు ఆగిపోయిన పాసెంజర్ రైళ్ల పునరుద్ధరణ, పొడిగింపుతో ప్రయాణికుల అవసరాలను తీర్చేలా నిర్ణయాలు తీసుకునేలా చర్చిస్తామని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

వీరవాసరం: మండల కేంద్రమైన వీరవాసరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం పై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ భీమవరం డివిజన్ ఇన్చార్జ స్వామి ఆధ్వర్యంలో అగ్నిఅస్త్రం కషాయం తయారు చేసి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనం తినే ఆహారమే మన ఆరోగ్యాన్ని కాపాడుతుందన్నారు. ఒక ఎకరానికి తయారీ విధానాన్ని రైతులకు వివరించారు. ఆవు మూత్రం 10 లీటర్లు, వేప ఆకులు 5 కేజీలు, పొగాకు కేజీ, పచ్చిమిర్చి కేజీ, వెల్లుల్లి అరకేజీ అగ్ని అస్త్రం తయారు చేయడానికి అవసరమన్నారు. మాస్టర్ ట్రైనర్ రమేష్, మండల ఇంఛార్జి యూనిట్ ఇంచార్జ్ వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం

ఆకివీడు: విజయవాడ వరద బాధితులకు తమ వంతు కర్తవ్యంగా విద్యార్థులు ప్రజల వద్ద విరాళాలు సేకరించారని జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోట పోతరాజు చెప్పారు. విద్యార్థులు సేకరించిన రూ.20,124 చెక్కును బుధవారం భీమవరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఇన్‌చార్జి డీఈవో నాగమణికి అందజేసినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ముత్యాల వెంకటస్వామి, నాగేశ్వరరావు, పి.వెంకట్రావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ

ఆకివీడు: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలై నడవలేని స్థితిలో ఉన్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ విభాగం కార్యదర్శి కురెళ్ల పొలును నగర పంచాయతీ వైస్‌చైర్మన్ పుప్పాల పండు, మెప్మా మాజీ అధ్యక్షురాలు మోరా జ్యోతిరెడ్డి బుధవారం పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించే విధంగా నియోజక వర్గ కన్వీనర్ పీవీఎల్ నర్సింహరాజు కృషి చేశారన్నారు. పార్టీకి ఎనలేని సేవలందించిన పొలు మంచానపడటం బాధాకరమన్నారు. పరామర్శించిన వారిలో నగర పంచాయతీ విప్ పడాల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్ గేదల అప్పారావు, కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ జక్కీ పాల్గొన్నారు.



పొలును పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అన్నసమారాధన

భీమవరం: వినాయక చవితి ఉత్సవాలు ముగింపు సందర్భంగా భీమవరం రెస్ట్ హౌస్‌రోడ్‌లోని జాలర్ల రెండవ వీధిలో బుధవారం అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన వన్ టౌన్ సీఐ ఎం నాగరాజు మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్దలతో నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. 13 ఏళ్లుగా కుల, మతాలకు అతీతంగా ఐకమత్యంగా ఉత్సవాలు నిర్వహించడమేగాక మహిళలకు పసుపు, కుంకుమ, గాజులు పంపిణీ చేయడం సంతోషదాయకమన్నారు. మాజీ కౌన్సిలర్ విజ్జురోతి రాఘవులు, మైలాబత్తుల ఐజాక్ బాబు, జాలర్ల సంఘం అధ్యక్షుడు కరుకు పోతురాజు, ముల్లి నర్సింహమూర్తి, వాల్మీకి అప్పారావు, వాల్మీకి బాలాజీ, ఇందుకూరి శివాజీవర్మ , కారుమూరి నర్సింహమూర్తి (బాబు) అల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతో అనారోగ్యానికి దూరం

ఆకివీడు: వ్యాయామం, నడక ద్వారా అనారోగ్యాన్ని దూరంగా ఉంచుతాయని నగర పంచాయతీ కమిషనర్ జి.కృష్ణ మోహన్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు బుధవారం స్థానిక నగర పంచాయతీ నుంచి నడక ద్వారా ప్రజల్లో ఆరోగ్య చైతన్యాన్ని తీసుకొచ్చే కార్యక్రమం చేపట్టారు.

పచ్చధనం–పరిశుభ్రత ప్రజల బాధ్యత

మండలంలోని అయిభీమవరం గ్రామంలో స్వచ్ఛతా హీ రెండవ రోజు కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి విక్టర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ వ్యక్తీ ఒక మొక్కను నాటాలన్నారు.కార్యక్రమంలో ఎంపీడీవో కె.వాణి, ఈవోపీఆర్డీ సుబ్బారావు, సర్పంచ్ గాలి సామ్రాజ్యం, బీఎల్‌వో ఆనంద భూషణం, పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.